# హోలీ.. చెమ్మకేళీల హోలీ

టేయూ: సాయిఐశ్వర్య కాలనీలో హోలీ సంబురాల్లో కాలనీ వాసులు

మహేశ్‌నగర్‌లో జరిగిన హోలీ వేడుకల్లో కాలనీవాసులు

గాంధీ భవన్‌కాలనీలో హోలీ సంబురాలలో స్థానికులు

గోషామహల్‌లో జరిగిన హోలీ సంబురాలలో లక్ష్మణ్‌రావు

అంబర్‌పేటలోని కుమ్మరివాడిలో చిన్నారులు

అబిడ్స్, మార్చి 14 : హోలీ సంబురాలను గోషా మహల్, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బస్తీలు, కాలనీలలో ప్రజలు వయసు తారతమ్యం లేకుండా హోలీ సంబరాలలో మునిగితేలారు. హోలీ సందర్భంగా గుట్టు చప్పుడు కాకుండా బంగ్‌విక్రయాలు చోటు చేసుకున్నాయి. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన హోలీ సంబురాలలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యరెడ్డి పాల్గొన్నారు.

**అంబర్‌పేట :** నియోజకవర్గలోని పలు ప్రాంతాలలో ప్రజలు హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ పాల్గొన్నారు.

**గోల్నాక :** అంబర్ పేటలో హోలీ సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. యువత డ్యాన్స్‌లు చేస్తూ.. కేరింతలు కొడుతూ హోలీ వేడుకలు జరుపుకున్నారు. గురువారం రాత్రి అన్ని కూడళ్లలో కామ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబర్ పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, గోల్నాకలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ హోలీ సంబురాల్లో పాల్గొని ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కాగా ముస్లింలు రంజాన్ మాసంలో శుక్రవారం కావడంతో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అంబర్ పేట ఇన్ స్పెక్టర్ డి.అశోక్ నేతృత్వంలో ముందస్తు జాగ్రత్తగా గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన హోలీ సంబురాల్లో పాల్గొన్న యువతీయువకులు

**మెహిదీపట్నం:** హోలీని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలో ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కొన్ని ప్రాంతాలలో ముస్లింలు హోలీ పండుగలో పాల్గొనడం విశేషం. అవాంఛనీయ ఘటన జరగకుండా దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏసీపీ లు విజయ శ్రీనివాస్, సయ్యద్ ఫయాజ్‌ల పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యారెడ్డి

మెహిదీపట్నం : గోల్కొండలో కామ దహనం చేస్తున్న స్తానికులు

కాచిగూడ : గోల్నాకలోని కార్బానాలైన్‌లో హోలీఆడుతున్న మహిళలు

అంబర్‌పేటలో హోలీ వేడుకల్లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

మెహిదీపట్నం : మల్లేపల్లిలో హోలీ సంబురాలలో పాల్గొన్న ముస్లింలు

అబిడ్స్ : లాల్‌దర్వాజలో హోలీ వేడుకలలో చిన్నారులు

హోలీ వేడుకలలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ

హోలీ వేడుకలలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట ఛే నంబర్‌లో హోలీ వేడుకలో యువతీయువకులు

సింహవాహిని ఆలయంవద్ద హోళీ వేడుకలలో పాల్గొన్న కె.వెంకటేశ్ తదితరులు

అబిడ్స్ : హోలీ వేడుకలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్

## 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ, మార్చి 14: 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం బర్కత్పుర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ ఈనెల 19వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో అఖిల పక్ష ఎంపీల మద్దతు సమీకరించడానికి చలో పార్లమెంట్ ను ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సమగ్ర కులగాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యా,ఉద్యోగాలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని,కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఓ బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నరేందర్, శ్రీకాంత్ గౌడ్, పండరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## 16న 'జర్నలిజం మహిళలు సవాళ్లు' అంశంపై సెమినార్

కవాడిగూడ, మార్చి 14: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్ తెలిపారు. ఓయూ జర్నలిజం రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మ జాషా, ఎన్డీటీవీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి ఉమాసుధీర్, విశిష్ట అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ ప్రియాచౌదరి, స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచంద్, టీన్యూస్ జర్నలిస్ట్ స్వేచ్ఛ, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే సలీమా పాల్గొంటారని తెలిపారు. 'జర్నలిజం మహిళలు సవాళ్లు' అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.నాగవాణి, పి.విజయ, మణిమాల, రోజారాణి వ్యవహరిస్తారని చెప్పారు. వివిధ పత్రికలు, టీవీ చానళ్లలో పనిచేస్తున్న సీనియర్ మహిళా జర్నలిస్ట్‌లకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు.

## ఆదివాసీ సంఘీభావ వేదిక ఆవిర్భావం

ముషీరాబాద్, మార్చి 14: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ఆవిర్భావ సభ శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్లో జరిగింది. వేదిక కన్వీనర్స్‌గా దళిత లిబరేషన్ ఫ్రంట్ నేత ఇందిర, ప్రజా కళామండలి నాయకురాలు రాణి, చైతన్య మహిళా సంఘం జయక్క, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నేత రవి, ఏఐఎఫ్టీయూ మల్లేష్, ఐఏపీఎల్ సురేష్‌కుమార్, పీడీఎస్‌యూ మహేశ్. అమరుల బంధు మిత్రుల సంఘం సత్య , తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాంబాబు ఎంపికయ్యారు. పౌరహక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కన్వీనర్‌గా కొనసాగుతారు. కోఆర్డినేటర్ కమిటీలో రైతు కూలి సంఘం జి.వెంకటేశ్వరరావు ఎంపికైనట్లు తెలిపారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.

## ప్రశాంతంగా ప్రార్థనలు

రంజాన్ మాసం సందర్భంగా రెండో శుక్రవారం ప్రార్థనలు నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో ప్రశాంతంగా ముగిశాయి. గోల్కొండలో జరిగిన ప్రార్థనలలో ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్‌తో పాటు గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

– మెహిదీపట్నం

## రైల్లో దొంగతనాలు

కాచిగూడ, మార్చి 14: బిక్కనూర్ స్పెషల్ రైల్లో దొంగతనాలు జరిగాయి. కాచిగూడ రైల్వే ఇన్స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, అమరావతికి చెందిన దినేశ్‌రావు(35) బిక్కనూర్ స్పెషల్ రైలులో కాచిగూడకు వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దినేశ్‌రావు బ్యాగులోంచి 8 గ్రాముల బంగారు ఆభరణాలు, ఫోన్లను దొంగిలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

**మరో ఘటనలో..**

రాజేంద్రనగర్ అత్తాపూర్ ప్రాంతానికి చెందిన గోవింద్ నారాయణ రాటి బిక్కనూర్ స్పెషల్ రైల్లో కాచిగూడ వస్తుండగా అతని బ్యాగులోంచి రూ.6 వేలు, ఆధార్, ఏటీఎం కార్డులను దొంగిలించారు. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిజాంబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్టు రైల్వే సీఐ తెలిపారు.

## మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కాచిగూడ, మార్చి 14: ఇంటి ముందు మద్యం బాటిళ్లను అమ్ముతున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శాస్త్రినగర్‌కు చెందిన శ్యామ్ శంకర్(35) శుక్రవారం హోలీ పండుగ కావడంతో ఇతర ప్రాంతాల్లో నుంచి శంకర్ మద్యం బాటిల్ తీసుకువచ్చి అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కాచిగూడ ఎస్ఐ నరేష్ అతని ఇంటిపై దాడి చేసి 10 క్వార్టర్స్ మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం

కవాడిగూడ, మార్చి 14: దేశంలోనే అగ్రభాగంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన తొలి సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. వ్యాఖ్యలను తక్షణమే వెనక్కు తీసుకొని కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ముఠా జయసింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం చిక్కడపల్లి సీఐ బి.రాజు నాయక్‌ను కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఫిర్యాదు అందజేశారు. ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సస్పెండ్ చెయ్యడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనం

**అడ్వకేట్ జేఏసీ అధికార ప్రతినిధి సీహెచ్ ఉపేంద్ర**

సుల్తాన్ బజార్/ నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 14 : అబద్ధపు వాగ్దానాలతో 6 గ్యారెంటీలు, వందల హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై అనైతిక చర్యలు చేపట్టడం చట్టవ్యతిరేకమని, ప్రతిపక్ష నాయకులపై అసెంబ్లీలో చేపడుతున్న చర్యలు ప్రభుత్వ నియంతృత్వ పోకడకు నిదర్శనమని అడ్వకేట్ జేఏసీ అధికార ప్రతినిధి ఉపేంద్ర స్పష్టం చేశారు. మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిని శాసనసభ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం వారి గొంతునొక్కడమే నన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని బేషరతుగా వాపస్ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్పీకర్ పట్ల ఎలాంటి తప్పుడు మాటలు మాట్లాడనప్పటికీ సస్పెన్షన్ వేటు వేసి నాలుగు కోట్ల ప్రజల మనోభావాల్ని దెబ్బతీశారని అన్నారు. ప్రజల కోసం ప్రతిపక్షం తరపున సభకు తెలియజేయడం హక్కుగా పరిగణించాల్సిందిపోయి హక్కులకు భంగం కల్గించేవిధంగా శాసన సభను నడిపించడం సరికాదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు గుర్తుచేసుకోవాలన్నారు. అదుపుతప్పి మాట్లాడుతన్న ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోకుండా సభా మర్యాదలు పాటించిన మాజీ మంత్రిపై వేటు వేయడం అమానుషమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానలతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రజలకు పథకాలను అమలు చేసేందుకు చేతకాకుండా కొనసాగుతున్న ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతల గొంతునొక్కడం ప్రజా వ్యతిరేకమని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని షాహినాయత్ గంజ్ సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్ మార్చి 14: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్లో సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకుల ఎం. శ్రీనివాసులు, కొల్లా ప్రదీప్, రాంప్రసాద్, విజయ్‌ముదిరాజ్, దశరథ్, విజ య్, హరికృష్ణ, రామన్, అనిల్ కుమార్, విష్ణువర్ధన్, చేతన్ తివారి, అజర్, ఫిరోజ్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, చందర్ శర్మ లతో కలిసి ఆయన ఇన్ స్పెక్టర్ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు.

## భక్తిశ్రద్ధలతో కోటి తలంబ్రాల సేవ

కోటి తలంబ్రాల సేవలో భాగంగా వడ్ల గింజలను గోటితో ఒలుస్తున్న భక్తులు

అమీర్పేట్ మార్చి 14: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు భక్తి పూర్వకంగా సమర్పించుకునే కోటి తలంబ్రాల సేవ మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో భక్తిశ్రద్ధలతో జరిగింది. భద్రాచలం నుంచి వచ్చిన వడ్లను భక్తులు తమ గోటితో ఒలిచి తలంబ్రాలుగా చేసి స్వామివారికి సమర్పిస్తారు. సనత్‌నగర్‌కు చెందిన సనాతన ధర్మబాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో భద్రాచలంలో శ్రీరాముల వారికి జరిగే కల్యాణోత్సవానికి 'గోటి తలంబ్రాలు' సిద్ధం చేసే బృహత్తర కార్యక్రమాన్ని శుక్రవారం మోడల్ కాలనీలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భద్రాచలం నుండి వచ్చిన వడ్లను తారక నామం పట్టిస్తూ గోటితో వలచిన బియ్యాన్ని స్వామి వారి కల్యాణోత్సవానికి ఉపయోగించే తలంబ్రాలుగా వీటిని సిద్ధం చేయడం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. భక్తులే స్వామివారికి తలంబ్రాలను సిద్ధం చేసే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్టు సేవలో పాల్గొన్న భక్తులు తెలిపారు.

## ఇఫ్తార్ విందు

నాంపల్లి నియోజకవర్గం రెడ్ హిల్స్ డివిజన్ బజార్ ఘాట్ లో శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓవైసీ మాట్లాడుతూ రంజాన్ మాసంలో అందరూ ఉపవాస దీక్షలు పాటించాలని అన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 14

## నిరంకుశ ప్రభుత్వానికి పతనం తప్పదు

సైదాబాద్ మార్చి 14 : చట్టసభలు ఉన్నది చట్టాలు చేయడానికే కానీ.. నిరంకుశ పాలన కొనసాగించడానికి కాదని బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకుడు అక్బర్‌బాగ్ డివిజన్ ఇన్‌చార్జి ఎం. శ్రీధర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పార్టీ నాయకులు అక్బర్‌బాగ్ డీమార్ట్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అనైతిక చర్యని అన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తుందన్నారు. ఆంధ్రా వారు తెలంగాణ నీళ్లు దోచుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిస్సహాయ స్థితిలో ఉందన్నారు. తెలంగాణలో ప్రజా పాలన సాగుతుందా? లేక నిరంకుశ పాలన కొనసాగుతుందా? అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో పర్సంటేజీల పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ అక్బర్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు జగన్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు, సరిత్, అజయ్, నితీశ్, వెంకట్, నర్సింగ్, రాము, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకులపై కేసులు

మలక్‌పేట : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పగిళ్ల నర్సింగ్ ఆధ్వర్యంలో స్థానిక నల్గొండ చౌరస్తాలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పార్టీ నాయకులపై చాదర్‌ఘాట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శుక్ర వారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఆర్ఎస్ నాయకులను స్టేషన్‌లో ఉంచి ఆపై 21 మందిపై కేసులు నమోదు చేశారు. నిరసన తెలిపి వెళ్లిపోయిన బీఆర్ఎస్ నాయకులకు చాదర్‌ఘాట్ పోలీసులు, సౌత్ ఈస్ట్ జోన్ ఏసీపీ ఫోన్లు చేసి స్టేషన్‌కు రావాలని, లేకుంటే తామే వచ్చి లిఫ్ట్ చేస్తామని బెదిరించినట్లు పేర్కొంటున్నారు.